సాక్షి సూర్యాపేట

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



ఓటరు స్లిప్పులు సిద్ధం

ఓటరు స్లిప్‌లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీటిని బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయనున్నారు.

- 8లో



హుండీ ఆదాయం రూ.2.30కోట్లు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, కానుకలను మంగళవారం లెక్కించారు.

- 8లో

గరిష్టం / కనిష్టం

41° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కక్షిదారులకు అందుబాటులో ఉండాలి



సన్మానం చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల(సూర్యాపేట) : న్యాయవాదులు కక్షిదారులకు అందుబాటులో ఉండాలని బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. బదిలీపై వెళ్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్‌ను మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి



మాట్లాడుతున్న సీపీఎం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి జహంగీర్

తిరుమలగిరి (తుంగతుర్తి) : లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, అవకాశవాద కాంగ్రెస్, అవినీతి బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఎం భువనగిరిలోక్ సభ నియోజకవర్గ అభ్యర్థి ఎం.డి.జహంగీర్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుమలగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 35 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. భువనగిరి గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని తెలిపారు. సీపీఎంపోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇళ్ల స్థలాలు సాధించి పెట్టామని అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో సంపదను ఉన్నత వర్గాలకు దోచి పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లు అదాని, అంబానీలకు అమ్ముతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, వనం సోమయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

క్షణికావేశంలో జీవితాన్ని శూన్యం చేసుకోవద్దు

సూర్యాపేట: జీవితం ఒక వరమని క్షణికావేశంలో దాన్ని శూన్యం చేసుకోవద్దని, చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి ఫలితాలు రాబోతున్నందున తల్లిదండ్రులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చదువే జీవితం కాదని, చదువురానివారు, ఫెయిల్ అయిన వారు వ్యాపారం చేస్తూ జీవితంలో ఉన్నత స్థానానికి ఎదిగారని పేర్కొన్నారు. చదువులో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం అయితపోయినట్టు కాదని ఇంకా ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఫెయిల్ అయిన వారు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఏమైనా ఒత్తిడిలు ఉంటే జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సైకియాట్రిస్టును సంప్రదించాలన్నారు. మీ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

ప్రచార హోరు

రోడ్‌షోలు, ర్యాలీలతో దూకుడు పెంచిన మూడు ప్రధానపార్టీలు

నేడు, రేపు మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో

- 3న ప్రధాని మోదీ రాక.. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- ఇటీవల భువనగిరిలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీ నియోజకవర్గాల్లో జోరుగా సభలు, సమావేశాలు



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: లోక్ సభ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. రోడ్‌షోలు, ర్యాలీలతో అన్ని పార్టీలు ఉత్సాహంతో ముందుకు సాగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైననాటి కంటే ముందునుంచే ప్రచారాన్ని మొదలు పెట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల భువనగిరిలో రోడ్‌షోలో పాల్గొనగా, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బుధ, గురువారం నల్లగొండ, భువనగిరి రోడ్ షోలో పాల్గొంటారు. బీజేపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలు, రోడ్ షోల్లో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జైశంకర్ పాల్గొన్నారు. వచ్చే నెల 3న ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. ఈనెల 25వ తేదీతో నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రచారంలో మరింత దూకుడు పెంచనున్నాయి. స్వతంత్రులు కూడా తమదైన శైలిలో ప్రచారం కొనసాగిస్తున్నారు.

ముందుగానే ప్రచారానికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ నల్లగొండ లోక్ సభ నియోజకవర్గానికి సంబంధించి మట్టపల్లిలో సన్నాహక సమావేశం నిర్వహించడం ద్వారా ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత నుంచి మండలాల వారీ సమావేశాలను నిర్వహిస్తోంది. ఈనెల 22న సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. 24న నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ర్యాలీ, రోడ్‌షో నిర్వహించబోతోంది. ఇందులో మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొననున్నారు. ఈనెల 25 నుంచి వచ్చే 3వ తేదీ వరకు మండలాల వారీగా ర్యాలీలు, రోడ్‌షోలు, సమావేశాలకు ఏర్పాట్లు చేసుకుంటోంది. భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. 25 నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి రోజుకు రెండు మూడు మండలాల్లో సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

రెండు రోజులు జిల్లాలోనే కేసీఆర్

బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే నల్లగొండ, భువనగిరిలో సన్నాహక సమావేశాలు నిర్వహించింది. ఈ సభలకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. అభ్యర్థుల నామినేషన్లు, మండలాల వారీ సమావేశాల్లో జగదీశ్‌రెడ్డి పాల్గొంటున్నారు. నియోజకవర్గాల వారీ సమావేశాలనూ ఇప్పటికే ప్రారంభించింది. మండల సమావేశాలన్నీ పూర్తి చేసుకొని గ్రామ స్థాయి సమావేశాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. వాటికంటే ముందే మాజీ సీఎం కేసీఆర్ బుధవారం జిల్లాకు వస్తున్నారు. కేసీఆర్ తన బస్సు యాత్రను నల్లగొండ జిల్లా నుంచే ప్రారంభించబోతున్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ర్యాలీలు, రోడ్ షోల్లో పాల్గొంటారు. బుధవారం సాయంత్రం 5:30 గంటలకు మిర్యాలగూడకు చేరుకొని అక్కడ రోడ్‌షోలో ప్రసంగిస్తారు. రాత్రి 7 గంటలకు సూర్యాపేట రోడ్‌షోలో పాల్గొనున్నారు. రాత్రి అక్కడే బస చేసి 25న రెండు నియోజకవర్గాల్లో పరిస్థితులు, ప్రచారంపై సమీక్షించి, ముఖ్య నేతలను కలువనున్నారు. సాయంత్రం 6 గంటలకు భువనగిరి చేరుకొని అక్కడ ర్యాలీ, రోడ్‌షోలో పాల్గొంటారు.

మోదీ సభకు సన్నాహాలు

వచ్చే నెల 3న జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నల్లగొండ, భువనగిరి రెండు లోక్‌సభనియోజకవర్గాలకు కలిపి ఉమ్మడి బహిరంగ సభ నిర్వహించబోతోంది. ఇప్పటికే బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించింది. వాటిల్లో పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నేతలు పాల్గొన్నారు. సోమవారం బీజేపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా బీజేపీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించింది. ఇందులో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, మంగళవారం భువనగిరిలో నిర్వహించిన ర్యాలీ, రోడ్‌షోలో కేంద్ర మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్, రాష్ట్ర నేతలు పాల్గొన్నారు. 24న ఓబీసీల మీటింగ్‌కు కమలం పార్టీ ఏర్పాట్లు చేసింది. 25 నుంచి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించనుంది. 27 నుంచి ప్రతి గ్రామంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 27, 28 తేదీల్లో ఎస్సీ, ఎస్టీలతో, మే 2న యువ మోర్చా సమావేశాలకు ఏర్పాట్లు చేసింది.

మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు



నాగారంబంగ్లా సమీపంలోని రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటరావు

- కలెక్టర్ వెంకటరావు

నాగారం : ధాన్యం దిగుమతుల విషయంలో మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటరావు హెచ్చరించారు. మంగళవారం నాగారం మండలం నాగారంబంగ్లా సమీపంలో ఉన్న వాసవి, వసుధా బాయిల్డ్ రైస్ మిల్లులను తనిఖీ చేసి, మిల్లుల్లో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. ధాన్యం దిగుమతులు, ఎగుమతులపై ఆరాతీసి మాట్లాడారు. మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. సీఎంఆర్‌ను సకాలంలో ప్రభుత్వానికి అందజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. లారీల్లో ధాన్యం ఒక్కరోజులోనే దిగుమతి చేసుకొని తిరిగి లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించాలన్నారు. వర్షాల నేపథ్యంలో తేమ శాతం, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం వహించకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, వచ్చిన ధాన్యం వెంటనే కాంటాలు వేసి, వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. కాంటా అయిన ధాన్యాన్ని వెంట, వెంటనే లారీల్లో మిల్లులకు తరలించాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏపీఎం శోభారాణి, రైతులు పాల్గొన్నారు.

నిరంతరం తనిఖీలు చేయాలి

సూర్యాపేట: ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం తనిఖీలు చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటరావు సూచించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, తాగునీరు తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 9,97,84,960 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని రైతులకు రూ. 65.80కోట్లు చెల్లించామన్నారు. తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్, సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదనరాజు, మత్స్యశాఖ అధికారి రూపెందర్ సింగ్, డీఎస్‌ఓ పద్మ, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలి

తుంగతుర్తి: అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని కలెక్టర్ వెంకటరావు సూచించారు. మంగళవారం తుంగతుర్తిలో నియోజకవర్గ స్థాయి సెక్టార్ అధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీరాహుల్‌హెగ్డేతో కలిసి మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ ఎన్నికల్లో విలేజ్ పోలీస్ వాలంటీర్స్ ప్రతి బూత్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ముందస్తుగా పరిశీలన చేయాలన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఎన్నికల విధుల పట్ల అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఎన్నికలు పూర్తి చేయడానికి అందరి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎస్పీ రవికుమార్, తహసీల్దార్ రమణారెడ్డి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎస్పీ రాహుల్‌హెగ్డే



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: లోక్ సభ ఎన్నికల నిర్వహణకు నియమితులైన అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. ఎన్నికల నిర్వహణ, భద్రతపై పోలీస్ నోడల్ అధికారులు, ట్రైనీ ఎస్పీతో కలిసి సీఐ, ఎస్‌ఐలతో మంగళవారం జిల్లా పోలీస్‌కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యమని పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడం, ఎన్నికలకు, ఎన్నికల సామగ్రికి, ఓటర్లకు భద్రత కల్పించడం ముఖ్యమన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సాధారణ విధులు, ఫిర్యాదులపై కూడా దృష్టి సారించాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పోలింగ కేంద్రాలను సందర్శించి అవసరమైన రక్షణ అంశాలను సవరించుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాట్లు చెక్ చేసుకోవాలన్నారు. సమావేశంలో హుజూర్‌నగర్ నోడల్ అధికారి ,అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, సూర్యాపేట నోడల్ అధికారి డీఎస్పీ రవి, కోదాడ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, సీఐలు రాజశేఖర్, రజితరెడ్డి, రాము, రామకృష్ణారెడ్డి, రఘువీర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ అధికారి విష్ణుమూర్తి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగాఅందంగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తిగట్టించారు. విశ్వక్సేనారాధన , పుణ్యాహవచనం , రక్షాబంధనం, రుత్విగ్వరణం,పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేశారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.

అకాల వర్షాలతో మూసీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటిమట్టం



మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. యాసంగిలో పంటల సాగుకు నీటి విడుదల నిలిపివేసే నాటికి రిజర్వాయర్‌లో నీటిమట్టం 618 అడుగుల డెడ్ స్టోరేజీకి (గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) తగ్గిపోయింది. అయితే, గత పది రోజుల నుంచి మూసీ ఎగువ, పరీవాహక ప్రాంతాలలో అక్కడక్కడా కురుస్తున్న అకాల వర్షాలకు మూసీలోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. మంగళవారం ఎగువ నుంచి 388.19 క్యూసెక్కుల నీరు వస్తుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీటిమట్టం పది రోజుల వ్యవధిలో మూడు అడుగులు పెరిగి మంగళవారం సాయంత్రానికి 621.40 అడుగులకు చేరుకుంది. 4.46 టీఎంసీల గరిష్ట నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.56 టీఎంసీ నీరు ఉందని అధికారులు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక



మట్టపల్లి వద్ద అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

మఠంపల్లి: వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం మఠంపల్లిలోని మట్టపల్లి వద్ద కృష్ణానదిపై నిర్మించిన మిషన్‌భగీరథ వాటర్ ప్లాంట్ (ఇన్‌టేక్‌వెల్)ను జెడ్పీ సీఈఓ అప్పారావుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడారు. భగీరథ స్కీమ్‌ను సంబంధిత ఇంజనీర్లు ,సిబ్బంది ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలన్నారు. కృష్ణానదిలో నీరుతగ్గుతోందని అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కరుణాకర్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఏఈలు శ్రీకాంత్, జయచంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- ముగిసిన ఎస్‌ఏ-2 పరీక్షలు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ
- చివరి రోజు తల్లిదండ్రులతో సమావేశాలు
- జూన్ 12 నుంచి బడులు పునఃప్రారంభం



అర్వపల్లిలో పిల్లలతో కలిసి సామాన్లు పట్టుకొని బస్సుల కోసం వేచి చూస్తున్న తల్లిదండ్రులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఏడాది పాటు తరగతులు, హోంవర్క్‌లు, ట్యూషన్లు, పరీక్షలతో సతమతమైన పాఠశాలల విద్యార్థులకు ఇక ఆటవిడుపు అవకాశం లభించనుంది. 48 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు రానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్ -2 పరీక్షలు ముగియడంతో విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. అలాగే కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేయగా మరికొన్నింటిలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి మరుసటి రోజు అందజేయనున్నారు.

జిల్లాలో 957 ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 957 ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి 9వ తరగతి వరకు చదివే వారు 39,541 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 234 ఉన్నాయి. వీటిలో మొత్తం 30వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో ఇది వరకు విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్‌ఏ1, 2, 3, 4, ఎస్‌ఏ 1, 2 పరీక్షలకు సంబంధించిన ఫలితాలను స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేశారు. పాఠశాల సముదాయంలో పని చేసే సీఆర్పీలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహాయంతో మార్కులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. మండలాల వారీగా ఇంకా నమోదు చేయని వారితో విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తున్నారు. సమ్మెటివ్ 2 పరీక్షలు కొనసాగిన రోజే జవాబు పత్రాలను ఆ రోజే దిద్దించే ఏర్పాట్లు చేయడంతో ఈ ప్రక్రియ సులువైంది. ప్రగతి పత్రంలో విద్యార్థి, పాఠశాల వివరాలు, ప్రతిభకు సంబంధించి మార్కులు, హాజరు వివరాలను పొందుపరిచారు.

చివరి రోజు తల్లిదండ్రుల సమావేశాలు..

జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు 957 ఉన్నాయి. సోమవారం ఎస్‌ఏ2 పరీక్షలు ముగిశాయి. ఈ విద్యా సంవత్సరానికి చివరి రోజైన మంగళవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులు సెలవులను సద్వినియోగానికి సంబంధించి పలు విషయాలను చర్చించి వివిధ అంశాలపై తీర్మానాలు చేశారు. అలాగే పలు పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో ప్రధానంగా వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్ ముట్టుకోకుండా జాగ్రత్తపడాలని, పత్రికలు, పుస్తక పఠనం వైపు దారి మళ్లించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సూచనలు చేశారు. గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివేలా చేయాలని, బంధుత్వాలను పరిచయం చేస్తూ నైతిక విలువలను నేర్పించాలన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువ, మానవ వికాసం వైపు మళ్లేలా స్వచ్ఛంద సంస్థల ద్వారా శిక్షణలు తీసుకోవాలని సమావేశాల్లో చెప్పారు.

జూన్ 12న బడులు పునఃప్రారంభం

వేసవి సెలవుల అనంతరం 2024-25 విద్యా సవత్సరానికి సంబంధించి పాఠశాలలు జూన్ 12న తెరుచుకోనున్నాయి. జూన్ మొదటి వారంలోనే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది యూనిఫాం, పుస్తకాలు కూడా ముందుగానే అందించేందుకు సిద్ధం చేస్తున్నట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సెలవులు వినియోగించుకోవాలి



వేసవి సెలవులను విద్యార్థులు వినియోగించుకోవాలి. అందుకు తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులు చెప్పినట్టుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రుల సమావేశంలో చెప్పే విషయాలను అవగాహన చేసుకొని ఆయా జాగ్రత్తలను పాటించాలి. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

– అశోక్, డీఈఓ



ప్రోగ్రెస్ కార్డులతో చివ్వెంల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

8 మంది అభ్యర్థులు.. 9 సెట్ల నామినేషన్లు



బీఆర్‌ఎస్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి



భువనగిరి: రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ స్థానానికి మంగళవారం 8 మంది అభ్యర్థులు 9 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వీరిలో ఇద్దరు రాజకీయ పార్టీ అభ్యర్థులు కాగా మిగిలిన ఆరుగురు స్వతంత్రులు. బీఆర్‌ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందనకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకు ముందు కృష్ణారెడ్డి మరోసెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. అదేవిధంగా ఎస్‌జేపీ (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా) తరఫున సుంకరి లింగయ్య నామినేషన్ వేశారు. ఇక.. స్వతంత్ర అభ్యర్థులుగా సంపంగి అఖిల్, రేల్ల పెద్ద నర్సింహరావు, సుంకరి రమేష్, అబ్దుల్ మాలిక్, కిన్నెర యాదయ్య, పోలిసెట్టి వెంకటేశ్వర్లు నామినేషన్ పత్రాలు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థుల్లో కిన్నెర యాదయ్య రెండోసారి నామినేషన్ వేశారు.

భువనగిరిలో 18 మంది..

భువనగిరి టౌన్ : భువనగిరి లోక్‌సభ స్థానానికి మంగళవారం మొత్తం 18 మంది 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, విడుతలై చిరుతైగల్ కచ్ పార్టీ అభ్యర్థిగా ఎర్ర సూర్యం, బహుజన్ ముక్తి పార్టీ నుంచి పెంట రమేష్, బహుజన్ లెఫ్ట్ పార్టీ నుంచి నూనె వెంకటస్వామి, బ్లూ ఇండియా పార్టీ తరఫున డప్పు వీరస్వామి, పీపుల్ ప్రొటక్షన్ పార్టీ అభ్యర్థి వి.సదానందరెడ్డి, అలయన్స్ ఆల్ డెమోక్రటిక్ రిఫమ్స్ పార్టీ నుంచి తాళ్లపల్లి రమేష్, సీపీఎం అభ్యర్థి జహంగీర్ తరఫున బట్టుపల్లి అనురాధ ఒక్కో సెట్, సీపీఎం అభ్యర్థి జహంగీర్ రెండు సెట్లు వేశారు. స్వతంత్రులుగా రేకల సైదులు, ఊదర మల్లేష్, పోతుల యాదగిరి, ఆరూరి వెంకటేశం, కారింగుల యాదగిరి, బొల్లారం బాలరాజు, బుషిపాక వెంకటయ్య, సంజీవులు ఒక్కో సెట్, జంగా సుజాత రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి హనుమంత్ కె. జెండగే నామినేషన్లు స్వీకరించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఓటరు స్లిప్పులు సిద్ధం


భువనగిరి కలెక్టరేట్‌లో పంపిణీకి సిద్ధంగా ఉంచిన కరపత్రాలు


కలెక్టరేట్‌కు చేరుకున్న ఓటరు స్లిప్పులు

- అభ్యర్థులకు గుర్తులు కేటాయించగానే బీఎల్‌ఓల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు
- ఓటింగ్ శాతం పెంచేందుకు కరపత్రాలు సైతం ముద్రణ

భువనగిరిటౌన్: గతంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులు పంపిణీ చేసేవారు. వారు ఈ ప్రక్రియను ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వాడుకుంటున్నట్లు గుర్తించిన ఎన్నికల కమిషన్ ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను రాజకీయ పార్టీలు చేపట్టడాన్ని నిషేధించింది. 2014 ఎన్నికల నుంచే బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటరు స్లిప్పులను పంపిణీ చేసే విధానాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో కూడా నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు గుర్తులు కేటాయించగానే ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు.

మరింత సమాచారంతో..

ఈసారి ఓటరు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మెరుగైన సమాచారాన్ని జోడించి ఓటరు స్లిప్పులు ముద్రించారు. కొత్త ఓటరు స్లిప్పులలో ఓటరు పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రం నంబరుతో పాటు పోలింగ్ తేదీ, సమయం, ఏమైనా సందేహాలుంటే ఫోన్ చేయాల్సిన నెంబర్, ఇంటి నంబర్ తదితర వివరాలను పొందుపర్చారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కోసం బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ సారి ఓటరు స్లిప్పులలో క్యూఆర్ కోడ్ ఇచ్చారు. ఈ క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే ఓటరుకు సంబంధించిన పూర్తి వివరాలు ఫొటోతో సహా వస్తాయి.

ఓటింగ్‌పై అవగాహన కోసం కరపత్రాలు..

లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు గాను ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల సంఘం ప్రత్యేక కరపత్రాలను రూపొందించింది. భువనగిరి కలెక్టరేట్‌లో ఎన్నికల కమిషన్ ముద్రించిన కరపత్రాలు, ఓటరు స్లిప్పులను భద్రపరిచారు. ఓటరు స్లిప్పులతో పాటు ఈ కరపత్రాలను బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పంపిణీ చేయనున్నారు. ఎన్నికల్లో ఏమైనా అవకతవకలు జరిగినట్లు గుర్తించినా, సమాచారం అందినా, బాధ్యత గల పౌరుడిగా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆన్‌లైన్ యాప్‌ల వివరాలు ఈ కరపత్రంలో ముద్రించారు.

కలెక్టరేట్‌కు వచ్చిన పోలింగ్ సామగ్రి

భువనగిరిటౌన్: పోలింగ్ స్టేషన్లలో కావాల్సిన సామగ్రిని మంగళవారం భువనగిరి కలెక్టరేట్‌కు ఎన్నిక కమిషన్ డీసీఎం ద్వారా చేరవేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో కిట్‌ను కేటాయిస్తున్నట్లు సమాచారం. పెన్నులు, బుక్స్, పోలింగ్ కేంద్రం నంబర్, అభ్యర్థుల పేర్లు రాయడం కోసం వైట్ చార్టులు, సీల్ వేయడం కోసం మైనం వంటి సామగ్రిని ప్రత్యేక కిట్‌గా తయారుచేసి పంపించారు. కలెక్టరేట్ నుంచి నుంచి టాటా ఏస్ వాహనంలో ఆలేరు నియోజకవర్గంలోని స్ట్రాంగ్‌రూంకు ఆలేరు పోలింగ్ సామగ్రిని తరలిస్తున్నారు.


ఆలేరు నియోజకవర్గానికి పంపిస్తున్న పోలింగ్ సామగ్రి కిట్‌లు

నేడు రఘువీర్‌రెడ్డి నామినేషన్

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 12.30గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటలకు నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో గల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమంలో రఘువీర్‌రెడ్డితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం వివేకానంద విగ్రహం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం క్లాక్‌టవర్ సెంటర్ వద్ద నిర్వహించే సభలో మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తారని తెలిపారు.

కంచర్ల కృష్ణారెడ్డి ఆస్తులు రూ.82కోట్లు

నల్లగొండ: ఎన్నికల అఫిడవిట్‌లో బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తన పేరిట రూ.82.06కోట్ల స్థిర, చరాస్తులున్నట్లు పేర్కొన్నారు. తన భార్య పేరిట రూ.1.06 కోట్ల ఆస్తులు ఉన్నట్లు చూపించారు. కృష్ణారెడ్డి చేతిలో రూ.88వేలు, తన భార్య చేతిలో రూ.18,600 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో వీరి పేరిట రూ.96లక్షల డిపాజిట్లు ఉన్నట్లు చూపారు. తన భార్య పేరున రూ.30లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నాయని పేర్కొన్నారు. రూ.34లక్షల విలువ చేసే రెండు వాహనాలు, చిట్యాల మండలం ఉరుమడ్లలో, మరికొన్ని చోట్ల వ్యవసాయభూములు, ప్లాట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపారు.

చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి బీ-ఫాం అందజేత


బీ-ఫాం అందుకుంటున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గాంధీభవన్‌లో మంగళవారం బీ-ఫాం అందుకున్నారు. ఆయనకు ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి తదితరులు బీ-ఫాం అందజేశారు.

కోలాహలంగా 'కంచర్ల' నామినేషన్


బైక్‌లతో ర్యాలీగా వెళ్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, రవీంద్రకుమార్

- నల్లగొండ ఎంపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ
- పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ టూటౌన్: బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్ నుంచి వీటీ కాలనీ, ఎన్జీ కాలేజ్, క్లాక్‌టవర్ సెంటర్, రాష్ట్రపతి రోడ్, భాస్కర్ టాకీస్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కంచర్ల కృష్ణారెడ్డితో పాటు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎన్. భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్య యాదవ్ ఓపెన్ టాప్ జీపుపై నిలబడి కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి బుల్లెట్ బైక్‌పై వచ్చి కార్యకర్తల్లో జోష్ నింపారు. కలెక్టరేట్ వద్ద కార్యకర్తలనుద్దేశించి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు, ప్రజల ఉత్సాహం చూస్తుంటే కంచర్ల కృష్ణారెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నాడని అన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రైతులకు సాగు నీరు ఇవ్వలేని దద్దమ్మ మంత్రులు జిల్లాలో ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లు పదవుల కోసం నోరు మూసుకున్నారని, ఓటు అడిగే హక్కు కేసీఆర్‌కు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, సూర్యాపేట జెడ్పీ చైర్మన్ వెంకట్‌నారాయణగౌడ్, ఇస్లావత్ రాంచందర్‌నాయక్, కటికం సత్తయ్యగౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో బుల్లెట్ బైక్ నడుపుతున్న నోముల భగత్, వెనుక కంచర్ల భూపాల్‌రెడ్డి

ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

నూతనకల్: లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఓటు వేసి బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ అన్నారు. మంగళవారం నూతనకల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చిలుకుంట్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు దన్నుగా నిలిచిన బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని వారు కోరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను అన్ని రకాలుగా వంచించిందని, బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లడిగే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం అభ్యర్థిని లోక్‌సభకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు మల్లు లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, కోట గోపి, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎండీ జహంగీర్, చిత్రంలో జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి

శాస్త్రవేత్తల సలహాలతో అధిక దిగుబడులు


కేవీకే స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం : పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో మంగళవారం కేవీకే స్వర్ణోత్సవాలను శాస్త్రవేత్తలు రైతులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడారు. జిల్లాలోని రైతులకు వివిధ పంటల సాగులో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలనికి అనుగుణంగా వ్యవసాయంలో వివిధ పంటల సాగులో రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నల్లగొండ జిల్లాలో కేవీకే కంపాసాగర్ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలు, వ్యవసాయంలో షెడ్యూల్ కులాలకు చేపట్టిన పథకాలు, యువతను వ్యవసాయం వైపు ఆకర్షిచడం వంటి కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, సస్య రక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, సిబ్బంది, జిల్లాలో రైతులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- 15మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన పెనుప్రమాదం
- మునగాలలో ఘటన


ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ధ్వంసమైన ఇంటి గోడ

మునగాల: రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెలను తప్పించే క్రమంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రహదారి పక్కన ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఏపీలోని అమలాపురం వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు మునగాల మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రి ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గేదెలు అడ్డువచ్చాయి. డ్రైవర్ గేదెలను తప్పించే ప్రయత్నం చేయగా.. బస్సు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభంతో పాటు ఆ ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన బైక్‌ను కూడా బస్సు ఢీకొట్టింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా 15మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను వేరే బస్సులో స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.2.30కోట్లు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలును ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది మంగళవారం కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.2,30,76,344 నగదు లభించింది. ఇక మిశ్రమ బంగారం 147 గ్రాములు, మిశ్రమ వెండి 4కిలోల 900గ్రాములు వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. వాటితో పాటు వివిధ దేశాల కరెన్సీలు సైతం వచ్చాయని, ఈ హుండీ ఆదాయం 28రోజులదని ఈఓ తెలిపారు.


హుండీల్లోని నగదు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

యాదాద్రి ఆలయ ఘాట్ రోడ్డులో మైక్‌ల బిగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులను నిత్యం ఆధ్యాత్మిక చింతన కలిగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే కొండపైన స్వాగత తోరణం నుంచి మూడవ ఘాట్ రోడ్డులో మైక్‌లను బిగిస్తున్నారు. స్వామివారి భక్తి పాటలు, శ్లోకాలు ఘాట్ దారిలో, కొండ కింద బస్టాండ్, మెయిన్ పార్కింగ్, లక్ష్మీ పుష్కరిణి ప్రాంతాల్లో ఈ మైక్‌ల ద్వారా భక్తులకు వినిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం: రాజకీయ పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నామినేషన్ల సందర్భంగా సభలు, ర్యాలీలు నిర్వహించేటప్పుడు ముందస్తు అనుమతి పొందాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో, నామినేషన్ ఉపసంహరించుకునే విధంగా నిందలు వేయడం, ప్రకటనలు ఇవ్వడం చేయొద్దని సూచించారు.

పశువులను తరలిస్తున్న వాహనం బోల్తా

హాలియా: పశువులను కబేళాలకు తరలిస్తున్న ఓ బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన హాలియా శివారులోని ఈశ్వనగర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదు ఆవులు మృతి చెందాయి. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రంలోని పాత కృష్ణ జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన డ్రైవర్ శ్రీను హనుమాన్ జంక్షన్ నుంచి మొత్తం 13పశువులు (ఆవులు, ఎద్దులు) కొనుగోలు చేసి బొలెరో వాహనంలో కబేళాలకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో బొలేరో వాహనం హాలియా శివారులోని ఈశ్వర్‌నగర్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదు ఆవులు మృతి చెందగా.. మరో 8 పశువులకు స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీనును అదుపులోకి తీసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

పీఏసీఎస్ సీఈఓపై విచారణ

చిలుకూరు: మండలంలోని నారాయణపురం ప్రాథమిక సహకార సంఘం సీఈఓ సాకి వెంకటేశ్వర్లు (బాబు) పుట్టినతేదీని తప్పుగా నమోదు చేయించుకుని పదవీ విరమణ పొందకుండా ఇంకా విధులు నిర్వహిస్తున్నాడని సంఘం డైరెక్టర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా సహకార సంఘం అధికారి ఆదేశాల మేరకు సీఈఓ సాకి వెంకటేశ్వర్లుపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అతడు 7వ తరగతి చదివిన చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ నుంచి, పదో తరగతి చదివిన హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం జెడ్పీహెచ్‌ఎస్ నుంచి సర్టిఫికెట్లు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం చైర్మన్ కొండా సైదులు, డైరెక్టర్లు స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం నివేదికను డీసీఓకు అందజేయనున్నట్లు వివరించారు.


విచారణ చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య

భార్యాభర్తల మధ్య విభేదాలతో పిల్లల భిక్షాటన

గరిడేపల్లి: భార్యాభర్తల మధ్య విభేదాలు తమ పిల్లల పాలిట శాపంగా మారింది. దీంతో నాయనమ్మ పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఘటన మంగళవారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో జరిగింది. బాలల పరిరక్షణ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన చింతలచెర్వు సతీష్ లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. భర్త సతీష్ మద్యానికి బానిసై ప్రతిరోజు తాగివస్తుండడంతో భార్య లక్ష్మి పిల్లలు ముగ్గురిని తండ్రి వద్దే వదిలేసి వెళ్లిపోయింది. మందుకు బానిసైన తండ్రి సతీష్ పిల్లలను పట్టించుకోకపోవడంతో వారి ఆలనాపాలనా నాయనమ్మ రామతిలకంపై పడింది. దీంతో నాయనమ్మ రామతిలకం చేసేదిలేక పిల్లలను ఊరూరా తిప్పుతూ భిక్షాటన చేయిస్తూ పోషిస్తుంది. ఈ క్రమంలో రామతిలకం రాయినిగూడెంలో సోమవారం ఓ ఫంక్షన్ జరుగుతుండగా పిల్లలను తీసుకొని వచ్చింది. ఆ ఫంక్షన్‌లో పిల్లలకు భోజనం చేయించి అనంతరం స్థానిక బస్టాండ్‌కు వెళ్లింది. మంగళవారం రామతిలకం పిల్లలను కొడుతుందనుకుని గ్రామస్తులు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని చైల్డ్ వైల్ఫేర్ అధికారులకు విషయం తెలిపారు. వారు రాయినిగూడెం చేరుకొని పిల్లలను సూర్యాపేటలోని బాలసదన్‌కు తరలించినట్లు తెలిపారు.


భిక్షాటన చేస్తున్న చిన్నారులు

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


అదృశ్యమైన స్వామి

అనంతగిరి : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనలో మండల పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలానికి చెందిన అయ్యన్నగారి స్వామి మండలంలోని పాలారంతండాలో జేసీబీతో పనులు చేసేందుకు ఈనెల18న వచ్చాడు. స్వామి అనంతగిరిలో ఉంటూ తండాలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 22న పాలారంతండాకు వెళ్లి పని ముగించుకొని అనంతగిరిలోని తన రూమ్‌కు వచ్చాడు. అనంతరం తన రూమ్ నుంచి బయటకు వెళ్లాడు. మళ్లీ ఇప్పటికీ తిరిగిరాకపోవడంతో అతడి భార్య కవిత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

నకిరేకల్ : ట్రాక్టర్ అదుపుతప్పి 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మండలంలోని ఓగోడు గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. మండలంలో ఓగోడు గ్రామానికి చెందిన ఓ రైతు తన ట్రాక్టర్‌తో పొలం పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామశివారులోని చెరువుకట్ట సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి విద్యుత్ తీగలు తెగి వ్యవసాయ బావులకు, గ్రామానికి వెళ్లే లైన్‌పై పడడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామంలోని పలువురి ఇళ్లలో టీవీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. సంఘటనా స్థలాన్ని నకిరేకల్ విద్యుత్ ఏడీఏ శ్రీకాంత్, ఏఈ సాయిగణేష్ పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

వ్యవసాయ మోటార్ చోరీకి యత్నం

- గ్రామస్తులకు పట్టుబడిన దొంగలు


బోగారం గ్రామస్తులకు పట్టుబడిన దొంగలు

రామన్నపేట : వ్యవసాయ మోటార్‌ను చోరీ చేసేందుకు యత్నిస్తున్న దొంగలను గ్రామస్తులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంఘటన మండలం బోగారం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నలగొండ జిల్లా దోమలపల్లి గ్రామానికి చెందిన మహేష్, మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన గొలుసుల రాంబాబు, ఓర్సు శ్రీను బైక్‌పై వేములకొండకు వెళ్లారు. వారు తిరుగు ప్రయాణంలో మండలంలోని బోగారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామశివారులోని గంపల రామచంద్రారెడ్డికి చెందిన జుట్టుబావిలోని వ్యవసాయ మోటార్‌ను దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా సమీపంలో గేదెలను మేపుతున్న బొద్దుపల్లి స్వామి గమనించి మందలించాడు. వారు అతడిపై రాయితో దాడి చేయడానికి ప్రయత్నించి బైక్‌ను అక్కడే వదిలేసి పరుగులంకించుకున్నారు. స్వామి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న గ్రామస్తులకు ఫోన్ చేయగా వారు రెండు కిలోమీటర్ల మేర వెంబడించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. రైతు గంపల రామచంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పి.మల్లయ్య తెలిపారు.